క్లుప్తంగా

టెన్త్‌లో మండల టాపర్‌గా నిలిస్తే నగదు బహుమతి

గుత్తి: టెన్త్ పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచే విద్యార్థులకు రూ. 10,116 నగదు బహుమతి, మెమెంటో గుత్తి బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు, గుత్తి ఆర్ఎస్ మాజీ సర్పంచు పీవీ రమణ ప్రకటించారు. పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. బలిజ సంఘం అధ్యక్షుడు రమణ, కార్యదర్శి రాము, కోశాధికారి మంజు, బాలరాజు, శంకరయ్య, పగడాల శ్రీనివాసులు, రామాంజి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో సచివాలయ ఉద్యోగిని ప్రతిభ



షేక్ తస్నీమ్ ఫిర్దోస్‌ను అభినందిస్తున్న కమీషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: ఒడిస్సాలో ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ చెస్ టోర్నీ పోటీల్లో గుంతకల్లు 28వ వార్డు సచివాలయ మహిళా పోలీసు షేక్ తస్నీమ్ ఫిర్దోస్ సత్తాచాటి మూడోస్థానంలో నిలిచింది. ఆమెను గురువారం మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న, మెప్మా టీపీఆర్‌ఓ జి.మోహన్ అభినందించారు. ముస్ముందు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభాపాటవాలను ప్రదర్శించి భారతదేశ కీర్తిపతాకాన్ని ఎగురవేయాలని సూచించారు.

బాట సుంకులమ్మ ఆలయంలో చోరీ

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన కొలువై బాట సుంకులమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఆలయ ఆవరణలో భక్తులు కానుకలను సమర్పించేందుకు హుండీలు ఏర్పాటు చేశారు. 10 రోజుల క్రితం దుండగుడు హుండీలోని నగదు చోరీ చేశాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు గురువారం సీసీ కెమెరా పుటేజీని పరిశీలిస్తున్న క్రమంలో చోరీ ఘటన వెలుగు చూసింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి టౌన్: తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, తొమ్మిది ఆయా పోస్టులకు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సాజిద బేగం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మాపురం (ఓసీ) అంగన్ వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉండగా, చాలవేముల (ఓహెచ్), బోయరెడ్డిపల్లి (ఓసీ), జయనగర్ కాలనీ -3 (బీసీ-డీ), ఎం. కొట్టాలపల్లి (బీసీ-ఈ), చందన -2 (బీసీ-ఏ), నాగిరెడ్డిపల్లి (ఓసీ), ఎలుట్ల(ఎస్సీ), రాయలచెరువు -1 (ఓసీ), చేనేత కాలనీ-2 (బీసీ-బీ)లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో..

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు , సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ నాగమణి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 21 ఏళ్ల పైబడి 35 ఏళ్ల లోపు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 10వ తరగతి పాసై, స్థానికులుగా ఉండాలన్నారు. ఈ నెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భగత్‌సింగ్ ఆటో యూనియన్ దాతృత్వం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అదే గ్రామానికి చెందిన భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు గుంతకల్లు-కసాపురం మధ్య ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. నాయకులు సాకే నాగరాజు మట్లాడుతూ ఐదేళ్లుగా ఏటా రథోత్సవం రోజున భక్తులకు ఉచిత ఆటో సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగించాలి

గుంతకల్లుటౌన్: దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటిస్తూ ఆయన ఆశయాలు కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి జి.చిన్నా, ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములు, హనుమంతు, పీఓడబ్ల్యూ కార్యదర్శి ఆశాబీ పాల్గొన్నారు.

గుత్తిలో..

గుత్తి: పట్టణంలోని లచ్చానపల్లి రోడ్డులో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, నిజామ్ నివాళులు అర్పించారు. పెదబాబు, గౌతమ్ నాయక్, కృష్ణ, శివ నాయక్, శ్రీధర్ గౌడ్, వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



పెద్దపప్పూరు: జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



యల్లనూరు: అలంకరణలో పెద్దమ్మ అమ్మవారు

బుక్కరాయసముద్రం: ఉగాది పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఎదుట గురువారం ఉట్ల పరుష నిర్వహించారు. ఉట్ల మాను ఎక్కేందుకు యువకులు ఉత్సాహంగా తరలి వచ్చారు. ఉట్లమానును తిలకించేందుకు మండల పరిధిలోని వివిధ గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పెద్దమ్మ దేవాలయాల్లో పూజలు

యల్లనూరు: మండలంలోని కొడవండ్లపల్లి పెద్దమ్మ, యల్లనూరు పెద్దమ్మ, చిలమకూరు యల్లమ్మ ఆలయాల్లో ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం వేకువజామున నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బోనాలను సమర్పించి, మూగజీవాలను బలి ఇచ్చారు. కొడవండ్లపల్లి, యల్లనూరులో పెద్దమ్మ అమ్మవారిని నిమ్మ కాయలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

30న సీతారాముల కల్యాణం

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో వెలసిన కోదండ రామాలయంలో ఈనెల 30న ఎమ్మెల్యే పెద్దారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శేషగిరి శర్మ తెలిపారు. గురువారం ఉదయం గణపతి పూజ, గోపూజ, 10 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. 12 గంటలకు భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. 4 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వామి సేవలో పాల్గొనాలన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం

పెద్దపప్పూరు: ఉగాది పండగ సందర్భంగా పెద్దపప్పూరులోని రామకోటీ కాలనీ, మండలంలోని నరసాపురంలో చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవాన్ని గురువారం తొగట వీర క్షత్రియులు ఘనంగా నిర్వహించారు. స్థానికులే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి జ్యోతుల మహోత్సవాన్ని తిలకించారు. సిబ్బందితో కలసి ఎస్ఐ ఖాజా హుస్సేన్ బందోబస్తు పర్యవేక్షించారు.



బుక్కరాయసముద్రం: ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

మున్సిపాలిటీకి పన్ను బకాయి చెల్లింపు



వక్ఫ్‌బోర్డు,షాదీఖానాకు సంబంధించిన పన్ను రూ.33లక్షలు మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్ ఫయాజ్‌బాషా, వక్ఫ్‌బోర్డు సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం వక్ఫ్‌బోర్డు, షాదీఖానాలకు సంబంధించి పన్ను బకాయిలు రూ.33 లక్షలను మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, 2వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ షాషావలి, కమిటీ సభ్యులు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పాత బకాయిలు ఈ నెల 31వ తేదీలోపు ఒకేసారి బకాయిలు చెల్లించిన వారికి పన్నులో వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈనేపథ్యంలో కౌన్సిలర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్, సభ్యులు చర్చించి పన్ను బకాయి చెల్లించి ప్రభుత్వ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తీర్మానం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా తాడిపత్రి వక్ఫ్‌బోర్డు ఆస్తులకు సంబంధించి బకాయిలు రూ.29 లక్షలుండగా రూ.25లక్షలు, షాదీఖానాకు రూ.12 లక్షలు పన్ను బకాయిలుండగా రూ.8 లక్షల పన్ను చెల్లించారు. దీని ద్వారా వక్ఫ్‌బోర్డు ఆస్తులకు రూ.5 లక్షలు, షాదీఖానాకు రూ.4 లక్షలు వడ్డీలో రాయితీ పొందినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. పాత బకాయి చెల్లించినందుకు వారిని కమిషనర్ అభినందించారు. బకాయిదారులు ఈనెల 31వ తేదీలోపు పన్ను చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ కోరారు. రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలో తెల్లవారుజామున 3 గంటలకు కొళాయిలకు నీరు విడుదల చేయాలని కమిషనర్‌ను ఫయాజ్‌బాషా, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరీబాయి, ఆర్ఐ రవికిరణ్, వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, షాదీఖానా అధ్యక్షుడు అన్వర్, వైఎస్సార్ సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, షబీ తదితరులు పాల్గొన్నారు.

గదుల వేలంలో రూ.14.10 లక్షల ఆదాయం



యాడికిలో పంచాయతీ గదుల వేలం నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న నాలుగు గదులకు గురువారం పంచాయతీ ఆఫీసులో వేలం నిర్వహించారు. ఒకటో గదిని నెలకు రూ.9,700కు ఉల్లిగడ్డల బాలయ్య దక్కించుకున్నాడు. రెండో గదిని కూల్ డ్రింక్ యజమాని రఘువర్మ రూ.10,100కు, మూడో గదిని రూ 10వేలకు ఎరువుల దుకాణం యజమాని కులశేఖర్‌రెడ్డి దక్కించుకున్నాడు. నాలుగో గది సిమెంట్ అంగడి రమణ రూ10,500కు దక్కించుకున్నాడు. గతంలో మూడేళ్లకు ఈ నాలుగు గదుల వేలం పాటలో పంచాయతీకి రూ13,06,800లు ఆదాయం రాగా ప్రస్తుతం రూ14.10 లక్షలు ఆదాయం వచ్చినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ ఎర్రిస్వామి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి



కేజీబీవీ విద్యార్థినులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కొండన్న

యల్లనూరు: సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కొండన్న తెలిపారు. గురువారం మండలంలోని బొప్పేపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల హాజరుపట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు అందరూ సమయాపాలన పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా బయోమెట్రిక్ వేయాలన్నారు. పెండింగ్ ఎస్‌డీజీ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బొప్పేపల్లి , కూచివారిపల్లి పంచాయతీ కార్యదర్శులు సుజాత, గంగాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులు బాగా చదివి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమోతి, సీఆర్టీ లు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వీరాంజినేయులు

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం అసెంబ్లీలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మెన్ పామిడి వీరాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని సీఎం సూచించినట్లు వీరాంజినేయులు తెలిపారు.

సీఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పామిడి వీరాంజినేయులు →



హుండీ కానుకల లెక్కింపు రేపు

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శాశ్వత హుండీ కానుకలను ఈనెల 25న ఉదయం 11 గంటలకు లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల రోడ్డు సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగవేణి ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా బైక్ రైడింగ్ పోటీలు



విజేతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

పామిడి: సొరకాయలపేట గ్రామంలో సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం యువకులకు బైక్ రైడింగ్ పోటీలు నిర్వహించారు. 150 మీటర్ల లక్ష్యాన్ని నిర్దేశించగా పోటీల్లో పదిమంది పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు బైక్ రైడర్లు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నరేంద్ర, ఆదినారాయణ, సుబ్బకృష్ణకు నగదు బహుమతులను సర్పంచ్ మూలి నాగేశ్వర్‌రెడ్డి అందజేశారు. అనంతరం విజేతలను ఘనంగా సన్మానించారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామంలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.46400 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఎరడికెరలో..

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎరడికెర గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని కొందరు మద్యం సేవించి పేకాట ఆడుతుండటంతో స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. బ్రహ్మసముద్రం ఎస్ ఐ పరుశురాముడు సిబ్బందితో గురువారం మధ్యాహ్నం పేకాట స్థావరాలపై దాడి చేసి 10 మందిపై అరెస్టు చేసి, వారి నుంచి రూ.55 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలి

పుట్లూరు: అకాల వర్షంతో పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో ధరలు లేక రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉండటం వల్ల నష్టం వాటిల్లిన సమయంలో బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు అందుతున్నాయని తెలిపారు. అరటి, చీనీ, మొక్కజొన్న తదితర పంటలు అకాల వర్షంతో దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులను గుర్తించాలన్నారు. అనంతరం దోశలేడు, మడ్డిపల్లి, కుమ్మనమల, మడుగుపల్లి, ఎల్లుట్ల గ్రామ సచివాలయాల పరిధిలో త్వరితగతిన సర్వే చేపట్టడానికి మండల అధికారులు ఇతర సచివాలయాలకు చెందిన వ్యవసాయ సిబ్బందిని నియమించారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి ఫజులున్నీషా బేగం పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలోని రికార్డులను పరిశీలించి, స్పందన కార్యక్రమం నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచనలిచ్చారు.

పేద ముస్లింలకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఉర్దూ అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు నదీమ్ అహమ్మద్ తదితరులు

గుత్తి: పట్టణంలోని గుత్తి-అనంతపురం రోడ్డులో ఉన్న మదరసా ఆవరణలో సఫా బైతుల్ మాల్ శాఖ బాధ్యులు మౌలానా మహమ్మద్ హక్ ఆధ్వర్యంలో గురువారం రంజాన్ తోఫా(నిత్యావసరాలు) పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఉర్దూ అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు నదీమ్ అహమ్మద్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్ సాహెబ్ పాల్గొని ఉపవాస దీక్ష ఉన్న 183 మంది ముస్లింలకు ఒకొక్కరికి రూ. 2,500 విలువైన ఆహార కిట్లను పంపిణీ చేశారు. సఫా బైతుల్ మాల్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని కొనియాడారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు

అనంతరం నదీమ్ అహమ్మద్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. మాజీ సర్పంచు పీరా, షఫి, వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ అహ్మద్ బాషా, సభ్యులు ఫయాజ్ బాషా,రిజ్వాన్, జుబేర్, హాఫీజ్ కరీమ్, అన్వర్, ఇంజినీర్ జిలాన్ బాషా, షేక్షావలి, కువైట్ ఖాదర్ బాషా, ఇమ్రాన్ పలువురు ఉలేమాలు, హాఫీజ్‌లు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3 వరకూ పౌష్టికాహార పక్షోత్సవాలు



బాలింతలకు గుడ్లు అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

బుక్కరాయసముద్రం: గర్భిణులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో గాంధీ నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టిక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆకుకూరలు, గుడ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వీటి ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సరుకులను సక్రమంగా అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని సూచించారు. సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ, సూపర్‌వైజర్ ధనలక్ష్మి, కౌసల్య, బీసీసీ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కొండమ్మ, వార్డు మెంబర్ గాంధీ నగర్ ప్రసాద్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



రాయలచెరువులో రాతి దూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి

యాడికి: ఉగాది పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సహకారంతో మండలంలోని రాయలచెరువులో గురువారం లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి నాగేష్ ప్రారంభించారు. 919.5 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లె గ్రామానికి చెందిన వృషభాల యజమాని నాగయ్యకు దాత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు రూ.80వేలు జెడ్పీ మాజీ సభ్యుడు అందజేశారు. 841.6 అడుగులతో రెండో బహుమతి పొందిన నంద్యాల జిల్లా పీఆర్ పల్లె గ్రామానికి చెందిన వృషభాల యజమాని శ్రీరాములుకు రూ.50 వేలను నంద్యాలకు చెందిన శ్రీధర్‌రెడ్డి అందజేశారు. 564.7 అడుగులతో మూడో బహుమతి పొందిన గుంతకల్లు మండలం నాగసముద్రం జయరామిరెడ్డికి రూ.30 వేలను బ్రహ్మానందరెడ్డి అందజేశారు. 552 అడుగులతో నాలుగో బహుమతి పొందిన నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన మహేష్‌కు రూ.20వేలను రాయలచెరువు ఉపేంద్ర గౌడ్, లోకేష గౌడ్ సంయుక్తంగా అందజేశారు. 537.6 అడుగులతో ఐదో బహుమతి పొందిన యాడికి మండలం కుందన కోటకు చెందిన చెన్నప్పకు రూ.10 వేలను టీచర్ మనోహర్ అందజేశారు. 292.8 అడుగులతో ఆరో బహుమతి పొందిన గార్లదిన్నె మండలం క్రిష్ణాపురం నాగేశ్వరరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు రూ.8వేలు అంద జేశారు. 260.7 అడుగులతో ఏడో బహుమతి పొందిన రంగాపురం రామకృష్ణారెడ్డికి రూ.5 వేలను ఉప్పర రంగస్వామి అందజేశారు. కార్యక్రమంలో శివయ్య, రవికాంత్, హనుమంత రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం



స్నేహితుని కుటుంబానికి రూ.50 వేల చెక్కు అందజేస్తున్న దృశ్యం

యాడికి: అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 లో పదో తరగతి చదివిన కోనుప్పలపాడు గ్రామానికి చెందిన బాబు నెల క్రితం మృతి చెందాడు. ఆయన తాడిపత్రిలో నివసిస్తూ గ్రానైట్ పరిశ్రమలో గుమాస్తాగా విధులు నిర్వహించేవాడు. బాబుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన మృతి సమాచారం అందుకున్న తోటి పదో తరగతి పూర్వ మిత్రులు గురువారం తాడిపత్రికి వెళ్లి రూ.50వేల నగదుతో పాటు రూ.6 వేల విలువ చేసే నిత్యావసర సరుకులు బాబు కుటుంబ సభ్యులకు అందజేశారు.

'గేట్' పరీక్షలో జాతీయ స్థాయి ర్యాంకులు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ (అటానమస్) కళాశాల విద్యార్థులు గేట్-2023 పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఫిబ్రవరి నెలలో గేట్-2023 ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. వీటిలో మహమ్మద్ ముదాశీర్ (మెకానికల్) జాతీయ స్థాయిలో 3245, షేక్ మహమ్మద్ సుహేల్ (మెకానికల్) 208, భరత్‌కుమార్ (ఈసీఈ) 2049, శివ రామిరెడ్డి (ఈసీఈ) 1564, రవి తేజ్‌రెడ్డి (సీఎస్ఈ) 10445, ఇంద్రసేనారెడ్డి (సీఎస్ఈ) 1308 ర్యాంకులు సాధించారని తెలిపారు.